క్లుప్తంగా

ఈఎస్ఐ సదుపాయం కల్పిస్తాం



మెకానిక్‌లకు టపాసుల బాక్స్‌ను అందిస్తున్న అవుల మునిరెడ్డి

తిరుపతి అర్బన్: నిరంతరం వృత్తిలో శ్రమిస్తున్న మెకానిక్‌లతో పాటు వారి కుటుంబ సభ్యులందరికీ ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని తిరుపతి టూ వీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అవుల మునిరెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్‌లు అందరూ ప్రస్తుతం సమాజంలో ఆవిష్కృతమవుతున్న ఆధునిక టెక్నాలజీతో మార్కెట్లోకి వస్తున్న వాహనాల పట్ల అవగాహన కలిగి ఉండడంతో పాటు వృత్తిలో మరింత మెళకువలు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వృత్తిలో రాణించడంతోపాటు అసోసియేషన్‌కు సహకారం అందించాలని, సంఘ బలోపేతానికి దోహదపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మెకానిక్‌లకు దీపావళి సందర్భంగా టపాకాయలు, స్వీటు బాక్సులు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మణరావు, ప్రభు, గురు ఆచారి, జలంధర్, బాబు, కేశవ, మెకానిక్‌లు పాల్గొన్నారు.

బ్యాంకుల సహకారం మరువలేనిది



ముఖ్యఅతిథులను సన్మానిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

తిరుపతి(అలిపిరి): దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకుల సహకారం ప్రధానమని.. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ బ్యాంకుల ద్వారానే జరుగుతున్నాయని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు బ్యాంకుల సేవలపై ప్రశంసించారు. ఆదివారం కరకంబాడి రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో రెండోరోజు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ రెండో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎస్‌బీఎస్‌యూ ఏపీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అన్ని బ్యాంకుల ద్వారానే జరుగుతున్నాయని, మన యూనియన్లు మరింత శక్తివంతంగా ఎదగాలని ఆకాంక్షించారు. సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 7 వేల మంది ఉద్యోగులు, ఇతర రాష్ట్రాల నుంచి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు నగర పాలక సంస్థలో గ్రీవెన్స్

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ×ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్‌కార్డు జత పరచి, పనిచేసే ఫోన్ నంబర్లను పొందుపర్చాలని సూచించారు.

ముత్యాలహారం వితరణ



వెండితో కూడిన ముత్యాల హారాన్ని విరాళంగా అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: పట్టణంలో వెలసిన శ్రీకోదండరామస్వామి వారి ఆలయానికి దాతలు ముత్యాల హారాన్ని విరాళంగా అందజేశారు. ఆదివారం చంద్రగిరి పట్టణానికి చెందిన లక్ష్మీ కుటుంబ సభ్యులు రాముల వారికి సుమారు రూ.28,675 విలువైన వెండితో కూడిన ముత్యాల హారాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస బట్టర్ స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని హరిబాబుకు అందజేశారు. అనంతరం లక్ష్మీ కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటోకు భారీ జరిమానా

తిరుపతి క్రైమ్: నగరంలోని లీలామహల్ ఫ్లైఓవర్‌పై వన్‌వేలో ప్రయాణించిన ఆటోకు భారీ జరిమానా విధించినట్లు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణచారి తెలిపారు. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడిన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీని ద్వారా ఎదురుగా వచ్చే వాహనాలు వేగంతో వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మొదటిసారి ఫైన్‌తో వదిలేస్తామని, రెండోసారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించిన ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

నగరంలో ఎక్కువ శాతం మహిళలు ఇష్టపడే వన్‌గ్రామ్ గోల్డ్(గిల్ట్ నగలు)





సొగసు చూడ తరమా!

- వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీపై మహిళలకు పెరిగిన ఆసక్తి
- పాత డిజైన్లకే కొత్త హంగులతో ఆభరణాలు
- మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్న సంప్రదాయ గుట్టపూస..కాసుల మాల
- వేడుకల్లో అలనాటి మోడళ్ల నగల వైపే మొగ్గుతున్న వనితలు

తిరుపతి మంగళం : ఏంటిలా ఒంటి నిండా ఆభరణాలు దిగేసుకున్నావ్.. గుళ్లో అమ్మవారిలా అంటూ ఆభరణ ప్రియులైన మహిళలను ఆటపట్టించే రోజులు గతించాయి. నడుముకు వడ్డాణం, బంగారు పూల జడలు, కంఠం నిండుగా నెక్లెస్‌లు తదితర డిజైన్లు ఒక నాటి ఫ్యాషన్ కావచ్చు.. అయితే పాత డిజైన్లే అద్భుతమంటున్న అతివల సంఖ్య పెరుగుతోంది. గతంలో మోటుగా ఉంటాయని తీసి పడేసిన మోడళ్ల పైనే ఇప్పుడు మోజు పెంచుకుంటున్నారు. మన అమ్మమ్మలు, తాతమ్మల కాలం నాటి డిజైన్లకు ప్రాణం పోస్తున్నారు.

స్వర్ణాభరణాలపై మహిళలు మనసు పారేసుకుంటారు. ఫంక్షన్లకు వెళ్లేప్పుడు ఆకర్షణీయంగా నగలు ధరిస్తుంటారు. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. వన్‌గ్రామ్ గోల్డ్‌తో తయారు చేసిన జ్యువెలరీని సైతం అతివలు ఇష్టపడుతున్నారు. సంప్రదాయాలకు అనుగుణంగా తీర్చిదిద్దిన కవరింగ్ ఆభరణాలను వేసుకుని మురిసిపోతున్నారు. ముఖ్యంగా పాత కాలం మోడళ్ల వైపు ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి నగరంలో రోల్డ్ గోల్డ్ జ్యువెలరీ విక్రయించే దుకాణాలను ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఆకట్టుకునే నగలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

గిల్ట్ నగలపైనే..

రూ.లక్షలు పోసి బంగారం కొనలేని సామాన్య, మధ్యతరగతి మహిళలు వన్‌గ్రామ్ గోల్డ్ (గిల్ట్ నగలు)పై మోజు పెంచుకుంటున్నారు. బంగారానికి ఏమాత్రం తీసిపోకుండా బంగారు పూత ఆభరణాల దుకాణాలు తిరుపతి నగరంలో బోలెడు ఉన్నాయి. అందులో మహిళలకు అవసరమైన అనేక రకాల డిజైన్లలో ఆభరణాలు అందుబాటులో ఉంచారు. వాటితో వేడుకల్లో బంగారు నగలు ధరించే వారికేమీ తీసిపోకుండా ఉండేలా ఎక్కువ శాతం మహిళలు గిల్ట్ నగలు వేసుకుంటున్నారు.

కొత్తవాటి 'కంటే' మిన్న..

ఒకప్పటి పూర్తి సంప్రదాయ ఆభరణం అయిన కంటెలు మళ్లీ ట్రెండ్‌లోకి వచ్చాయి. రాజుల కాలంలో వీటిని ధరించే వారట.. ఇటీవల మహానటి సినిమాలో సావిత్రి పాత్రధారి కీర్తి సురేష్ సైతం ధరించి కనిపిస్తుంది. కాళ్లకి పట్టీ టైప్‌లో ఉంటూ, మెడకు ధరించే ఈ కంటి చూడడానికి థిక్‌గా ఒక రాడ్డులా ఉంటుంది. దీనికే పెండెంట్స్, పెరల్ డ్రాప్స్ జోడించడం, అలాగే స్టోన్స్‌తో క్వారింగ్ చేయడం ద్వారా మరింత ఫ్యాషనబుల్‌గా మారుస్తున్నారు. వీటి ధర రూ.వేల నుంచి రూ.లక్షల వరకు ఉంటుంది.

'కాసులు' గలగల..

కాసులు పేరు అనే తాతమ్మల కాలం నాటి సంప్రదాయ నగ ఇప్పుడు కొత్తగా సవ్వడి చేస్తోంది. ఆధునిక మహిళల మెడలో గలగలమంటోంది. అలాగే లక్ష్మీకాసుల మాలలు ఇప్పుడు టెంప్రీ, మామిడి పిందెల రూపంలో ఉండే కాసులను కూడా తయారు చేస్తున్నారు. వీటిని మ్యాంగో మాలలని పిలుస్తున్నారు. కనీసం 25 పైసలంత సైజులో ఉండే కాసులతో తయారయ్యే మాల 30 గ్రాముల నుంచి 300 గ్రాముల దాకా బరువు ఉండేవి ధరిస్తున్నారు. వీటి ఖరీదు కూడా రూ.వేల నుంచి రూ.లక్షల్లోనే పలుకుతోంది.

'కంకణం' కట్టుకుంటున్నారు..

మోచేతి అందాన్ని పెంచే గాజులను.. దానికి ముందుగా బంగారు కంకణం ధరించడం అనేది చాలా పాతకాలం నాటి ఆభరణాల శైలి. అయితే ఆధునిక వనితలు కూడా ఈ తరహా ట్రెండ్‌ని అనుసరిస్తున్నారు. రెండు చేతులకూ గాజులతో పాటు ఒక్కో కంకణం తొడుగుతున్నారు. ఇవి చూసేందుకు లావుగా ఉంటాయి. ఒక్కొక్కటి 30 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు బరువులో ఉంటాయి. వీటి ధర కూడా రూ.లక్షల్లోనే ఉంటుంది.

> **పాత మోడల్స్‌నే ఇష్టపడుతున్నారు..**
>
> మోటుగా ఉండే ఆభరణాలు అంటే ఇప్పుడు ఎవరూ అభ్యంతరం పెట్టడం లేదు. ఓల్డ్ ట్రెండ్స్‌ని అడిగి మరీ తెప్పించుకుంటున్నారు. ఇక పెళ్లి వేడుకల్లో అయితే పాతకాలం నాటి ఆభరణాలు తప్పనిసరిగా ధరిస్తున్నారు. బంగారుతో చేయించుకోవాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. కాబట్టి చాలామంది మహిళలు వన్‌గ్రామ్ గోల్డ్ (గిల్ట్) నగలనే ఇష్టపడుతున్నారు. అందులో వందల రకాల మోడళ్లు ఉన్నాయి. ఉన్నవారు, లేనివారు అని లేకుండా ప్రతి ఒక్కరు వీటిని ధరిస్తున్నారు.
>
> – సుజాత, వన్‌గ్రామ్ గోల్డ్ వినియోగదారు







వివిధ రకాల ఆభరణాలను కొనుగోలు చేసేందుకు ధరించి చూస్తున్న మహిళ

కూలిన ఇల్లు



కూలిన బండల మిద్దె

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లెకు చెందిన నాగాలి రమణకు చెందిన బండల మిద్దె వర్షానికి ఆదివారం కూలిపోయింది. అయితే ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. కూలి చేసుకుని జీవనం సాగిస్తున్న తనకు ఇల్లు ఉన్న కూలడంతో రోడ్డున పడ్డామని కుటుంబ సభ్యులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ సిబ్బంది

రేణిగుంట: మండలంలోని జీవాగ్రం కేఆర్‌సీ విద్యాసంస్థల్లో చదువుతున్న సుభాష్ 68వ స్కూల్ గేమ్స్ పోటీల్లో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. తిరుచానూరు జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. దీంతో నవంబర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని విద్యాసంస్థల ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి, కోచ్ కుమార షణ్ముగం తెలిపారు. విద్యార్థి సుభాష్‌ను స్కూల్ యాజమాన్యం అభినందించారు.

హంసధ్వని పుస్తకావిష్కరణ



పుస్తక రచయిత మరువాడ భీమశంకర్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

తిరుపతి అర్బన్: విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు మరువాడ భీమశంకర్ రాసిన హంసధ్వని పుస్తకాన్ని ఆదివారం ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆవిష్కరించారు. కర్ణాటక శాస్త్రీయ సంగీత సమగ్ర సమాచార సమాహారంగా రూపొందించిన ఈ పుస్తకం గొప్పదనం గురించి పలువురు వక్తలు కొనియాడారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య దక్షిణామూర్తి శర్మ మాట్లాడుతూ హంసధ్వని పుస్తకం చదవడం ద్వారా కర్ణాటక సంగీతంలోని అన్ని అంశాలను మనం అవగతం చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎస్వీయూ పర్‌ఫార్మింగ్ మాజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.పద్మ, ఎస్వీ సంగీత నృత్య కళాశాల గాత్ర విభాగాధిపతి డాక్టర్ ఏ.శబరి గిరీష్ హంసధ్వని పుస్తక సారాంశాన్ని వివరించారు. ముందుగా డాక్టర్ శబరి గిరీష్ నిర్వహించిన గాత్ర కచేరి ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ సి.లత, డాలర్స్ గ్రూప్ ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి, టీటీడీ ఏఈ మల్లం విజయ్‌కుమార్ రెడ్డి, సీనియర్ ప్రొడ్యూసర్ సీహెచ్ వెంకట్రావు, ప్రముఖ రంగస్థల నటుడు బొందు రామచంద్రారెడ్డి, పరిహార సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ భరద్వాజ చక్రపాణి, ప్రముఖ గేయ రచయిత జిల్లెల్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుధ పూజ



వాహనాలకు ఆయుధపూజ చేస్తున్న గ్రామ ప్రజలు

చంద్రగిరి: మండల పరిధిలోని పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లెలో ఆదివారం గ్రామ యువత ఘనంగా ఆయుధపూజ నిర్వహించారు. విజయ దశమిలో భాగంగా ఉదయం 10 గంటలకు గ్రామ దేవత సత్యమ్మ గుడి ముందు కాళికామాత చిత్రపటం ఉంచి ఆయుధ పూజ నిర్వహించారు. గ్రామంలోని ద్విచక్ర వాహనాలు, కారు ఒకచోట చేర్చి గ్రామం మొత్తం తరలివచ్చి ఆయుధపూజలో పాల్గొన్నారు. గత 25 ఏళ్లుగా ఇలా ఆయుధ పూజ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా గ్రామం మొత్తం డప్పు వాయిద్యాలతో, కోలాట నృత్యాలతో వాహన దారులు ఊరేగింపుగా పూజా సామగ్రిని తీసుకొచ్చారు. అనంతరం గ్రామస్తులు వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వాహనాలన్నీ పనపాకం జాతీయ రహదారి వరకు వెళ్లి తిరిగి అరిగిలవారిపల్లెకి చేరుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 75 వాహనాలకు పూజ చేశారు. అనంతరం మధ్యాహ్నం 400 మందికి జూపార్కు మాజీ డైరెక్టర్ మణియాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ బొజ్జ వెంకటరత్నం, మణి యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పానేటి చెంగల్రాయులు, గార్డు కృష్ణయ్య, అరిగిల రామచంద్రయ్య, గేనే సుబ్బయ్య, కసాగోపాల్, దళవాయి మునిరత్నం, దేవేంద్ర, శేషాద్రి, కృష్ణయ్య, మునేంద్రబాబు, జగన్నాథం, కోలాట గురువు ఆవుల రామారావు, వాహనదారులు పాల్గొన్నారు.

అలరించిన హరికథా గానం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన హరికథా విద్వాంసులు వెంకటేశ్వర్లు భాగవతార్ శ్రీసిటీలో ఆలపించిన పద్మావతి పరిణయం హరికథా గానం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. ఆరూరులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీసిటీ వ్యాపార వాణిజ్య కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. హరికథకు పాటలను జోడించి అద్భుత హావభావాల మేళవింపుతో శ్రీనివాసుడు పద్మావతిదేవి దివ్య వివాహాన్ని భాగవతార్ వెంకటేశ్వర్లు ఎంతో ఆసక్తికరంగా అనర్గళంగా వివరించారు. తిరుమల తిరుపతి ప్రాముఖ్యతను శ్రీనివాస భగవానుడి అవతారం, పద్మావతి పట్ల ఆయనకున్న ప్రేమ, వారి అపూర్వ కలయికను కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా హరికథా కళాకారులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ కార్యక్రమ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

మారెమ్మకు అంబలి

రేణిగుంట: మండల పరిధిలోని ఎలమండ్యం దళితవాడలో ఆదివారం మారెమ్మ తల్లికి మహిళలు అంబలిపోసి మొక్కులు చెల్లించారు. ఉదయం అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. తర్వాత గ్రామస్తులంతా ఆలయం వద్దకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. వేపాకు తోరణాలతో గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. రాత్రి అమ్మవారికి భారీస్థాయిలో కుంభాలు పోసి అమ్మవారి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో మారెమ్మ అమ్మవారు

భూమనకు ఘన స్వాగతం





భూమనకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు, మేయర్ శిరీషా

తిరుపతి మంగళం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుని, మొట్టమొదటిసారిగా తిరుపతికి విచ్చేసిన భూమన కరుణాకర రెడ్డికి, తిరుపతి విమానాశ్రయం దగ్గర స్వాగతం పలికారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ నాయకులు రఘునాథ రెడ్డి, అమాస రాజశేఖర రెడ్డి, దుద్దెల బాబు, కృష్ణమూర్తి, శివారెడ్డి, బొమ్మగుంట రవి, శేఖర్, చెంగల్ రాయుడు, చెన్నారెడ్డి కాలనీ చిట్టి, కన్నయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.



భూమనతో పార్టీ నేతలు

అన్నిదేశాలకు భారత రాజ్యాంగమే ఆదర్శం

పాకాల : భారతదేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాతినిధ్యం వహించి రచించిన భారత రాజ్యాంగం అన్ని దేశాలకు ఆదర్శమని విశ్రాంత ఉపాధ్యాయుడు గొడుగుచింత రామయ్య తెలిపారు. ఆదివారం స్థానిక పాకాల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి తాళ్ల రవీంద్రబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ అధ్యయన తరగతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజలు రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతీ ఒక్కరూ తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాబ్జి, డాక్టర్ సుధాకర్, ప్రభు, జ్యోతివెంకటరత్నం, ఉదయ్, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరత నాట్యం ప్రేక్షకులను అలరించింది. మద్రాసుకు చెందిన శ్రీశంకర నాట్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా శివ స్లోకం, శ్రీరామచంద్ర కీర్తన, స్వగతం కృష్ణ సుస్వాగతం, కన్నన్ వరుగింద్ర నీరం, ఆదిదానో రంగా, తోడై మంగళం, హరే రామరామ గోవింద్ హరే, కంగల తీరంత, గోవిందన్ కౌజల్ వంటి పాటలకు కళాకారులు హర్షద, అనూష, అక్షరం, సహానా, రోషికా, దీప్త, సంగీత, ధాన్వియ, ప్రగతి, భవదర్శిని, మహతి, యాషిని ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.





కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న కళాకారులు



